ప్రజాశక్తి
గురువారం 6 జూన్ 2024 5
శ్రీ సత్యసాయి

'పురం'లో టిడిపికి తగ్గని ఆదరణ

◆ పారని పెద్దిరెడ్డి పాచికలు

◆ ఒక్క రౌండ్ మినహా అన్నింటా బాలయ్య మెజార్టీ

ప్రజాశకి-హిందూపురం

టిడిపి ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులే ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఇక్కడి నుండి మూడుమార్లు పోటీ చేసి రెండు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఎన్టీఆర్ అనంతరం ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ సైతం ఇక్కడ నుండి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సిసి వెంకటరాముడు, పామిశెట్టి రంగనాయకులు, అబ్దుల్‌ఘనీ ఇక్కడ నుండి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేలుగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం వరుసగా నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ విజయాలను నమోదు చేశారు. వైసిపి నాయకులు ఎన్నికల ప్రచార సందర్భంలో బాలకృష్ణ స్థానికేతరుడని స్థానికంగా అందుబాటులో ఉండడని, ప్రజా సమస్యలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని తదితర విమర్శలు చేస్తూ ఓటర్లను ఆకర్షించుకునే ప్రయత్నం చేశారు. అయితే వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ ఏకంగా 32,597 ఓట్ల మెజార్టీతో బాలకృష్ణ విజయం సాధించారు. ఈ సారి ఎలాగైనా హిందూపురం అసెంబ్లీ నియోజక వర్గంలో వైసిపి జెండాను ఎగర వేయాలని మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి ఎత్తులకు పైఎత్తులు వేశారు. ఇది చాలదన్నట్లు బిసి మంత్రం, మహిళా మంత్రాన్ని ప్రయోగించినప్పటికి పుర ప్రజలు బాలయ్యకే మళ్లీ పట్టం కట్టారు. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో ఒక్క తొమ్మిదవ రౌండ్ మినహా మిగిలిన అన్ని రౌండ్లలోను బాలకృష్ణ ఆధిక్యతను కనబరుస్తూ వచ్చారు. తొమ్మిదవ రౌండ్లో బాలకృష్ణకు 5253 ఓట్లు రాగా దీపికకు 5773 ఓట్లు వచ్చాయి. దీంతో ఆ రౌండ్లో దీపికకు 520 ఓట్ల ఆధిక్యత లభించింది. ఆ రౌండ్ మినహా ఇక మిగిలిన అన్ని రౌండ్లలోను బాలకృష్ణ స్పష్టమైన ఆధిక్యతను కనబరుస్తూ దూసుకెళ్లారు. మొత్తం 19 రౌండ్లలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించగా మొదటి రౌండ్లో 1994, రెండో రౌండ్లో 5619, మూడవ రౌండ్‌లో 247, నాల్గవ రౌండ్‌లో 1699, ఐదవ రౌండ్‌లో 1391, ఆరవ రౌండ్‌లో 1763, ఏడవ రౌండ్‌లో 1810, ఎనిమిదవ రౌండ్‌లో 4730, పదో రౌండ్‌లో 2144, 11వ రౌండ్‌లో 2593, 12వ రౌండ్‌లో 1199, 13వ రౌండ్‌లో 2444, 14వ రౌండ్ లో 729, 15వ రౌండ్‌లో 1302, 16వ రౌండ్‌లో 346, 17వ రౌండ్‌లో 1560, 18వ రౌండ్‌లో 577, 19వ రౌండ్‌లో 215 ఓట్ల చొప్పున బాలకృష్ణ మెజారిటీ సాధించారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్‌లో నందమూరి బాలకృష్ణకు 1472 ఓట్లు రాగా దీపికకు 47 ఓట్లు వచ్చాయి. మొత్తం బాలకృష్ణకు 1, 07,250 ఓట్లు రాగా దీపికకు 74,653 ఓట్లు దక్కాయి. దీంతో బాలకృష్ణ 35,597 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఫలితాలను బట్టి చూస్తే హిందూపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పై అభిమానం ఆటు ప్రజల్లోనూ ఇటు అభిమానులను ఏమాత్రం తగ్గలేదన్న విషయం అర్థమవుతుంది.

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వైసిపి శ్రేణులను తీవ్రమైన నైరాశ్యంలో నెట్టివేశాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క స్థానం కూడా దక్కకపోవడం ఆ పార్టీ నేతలను విస్తుపోయేలా చేస్తోంది. సంక్షేమ పథకాల వల్ల తమకు తిరుగుండదని భావిస్తూ వచ్చిన వైసిపికి ఈ ఫలితాలు షాక్ నిచ్చాయి. ఓట్ల లెక్కింపు పూర్తయినప్పటి నుంచి ఫలితాలను చూసి కొలుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఎందుకు ఇలా జరిగిందన్నది అంతుబట్టక అయోమయంలో పడ్డారు. జిల్లాలో సీనియర్లుగా ఉన్న నేతలతోపాటు, కొత్తవారికి కూడా ఓటమి తప్పలేదు. ఈ ఓటమిపై ఇంకా విశ్లేషణ చేసుకునే స్థితిలోనూ ఆ పార్టీ నేతల్లేరు. ఆ పార్టీలో అంతా నిశబ్ద వాతావరణమే నెలకొంది.

◆ మార్పులు చేసినా ఫలించని వ్యూహం

◆ ఒక్క స్థానం కూడా రాకపోవడంతో డీలా

◆ తప్పిన ఐ ప్యాక్ అంచనాలు

◆ నేతల్లో అంతర్మథనం

వైసిపిలో నైరాశ్యం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అభ్యర్థుల ఖరారులోనూ అనేక జాగ్రత్తలను వైసిపి తీసుకుంది. వివిధ రకాల సర్వేలను ముందు పెట్టుకుని అభ్యర్థులను మార్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలుంటే ఏడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను మార్చింది. రెండు పార్లమెంటు స్థానాల్లోనూ మార్పులు చేపట్టింది. అయినా ఫలితం ఆశించినంత కనిపించలేదు. మార్పులు చేపట్టిన నియోజకవర్గాలు చూస్తే అనంతపురం పార్లమెంటు సభ్యులుగానున్న తలారి రంగయ్యను బీసీ సామాజిక తరగతిలో భాగంగా కళ్యాణదుర్గం అసెంబ్లీకి మార్చింది. అక్కడున్న మంత్రి ఉషశ్రీచరణ్‌ని పెనుకొండ అసెంబ్లీకి మార్చింది. అక్కడ ఎమ్మెల్యేగానున్న శంకరనారాయణను అనంతపురం పార్లమెంటుకు మార్చింది. ఇక హిందూపురానికి అంతకముందున్న మహమ్మద్ ఇక్బాల్‌ను తప్పించి దీపికను కొత్తగా తీసుకొచ్చారు. కదిరిలోనూ సిద్దారెడ్డిని తప్పించి మక్బుల్‌ను తీసుకొచ్చారు. మైనార్టీ అయితే కదిరి పట్టణంలో వర్కవుట్ అవుతుందని భావించారు. ఈ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. శింగనమలకు జొన్నలగడ్డ పద్మావతిని తప్పించి వీరాంజినేయులును తీసుకొచ్చారు. ఆయన టిప్పర్ డ్రైవరంటూ పెద్దఎత్తు ప్రచారం చేపట్టి సామాన్యుడికి టిక్కెట్టు ఇచ్చామని సానుభూతి ఓట్ల సంపాదించే ప్రయత్నంచేశారు. అదీ ఫలించలేదు. మడకశిరలోనూ వీరలక్కప్పను ఇదే రకంగా బరిలో దింపారు. అసలు టిడిపి చివరి క్షణంలో ఎంఎస్.రాజును బరిలో దింపింది. దీంతో ఆయన విజయం ఏ మేరకన్నది ప్రశ్నార్థకంగా ఉండింది. తక్కువ ఓట్ల మెజార్టీతో అయినా ఎంఎస్.రాజు విజయం సాధించారు. రాయదుర్గంలో కాపు రామచంద్రారెడ్డిని కాదని మెట్టుగోవిందరెడ్డిని తీసుకొచ్చింది. ఇక్కడా ఓటమి తప్పలేదు. ఇలా మార్పులు చేసిన ఏడు చోట్ల ఓటమి చవిచూడక తప్పలేదు. మార్పు జరగని మరో ఏడు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అనంతపురంలో సీనియర్ నాయకులు అనంత వెంకటంరామిరెడ్డి, తాడిపత్రిలో సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, గుంతకల్లులో వై.వెంకటరామిరెడ్డి, ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రాప్తాడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పుట్టపర్తి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వీరికీ ఓటమి తప్పలేదు. ఇలా రెండు విధాలుగా వైసిపి ఎత్తుగడలు ఫలించలేదు.

ఐ ప్యాక్ అంచనాలు తప్పాయా..

ఎన్నికల వ్యూహాల కోసమే ఏర్పాటు చేసుకున్న ఐ ప్యాక్ అంచనాలు కూడా తప్పాయా అన్న చర్చ నడుస్తోంది. వైసిపి కోసం పనిచేసిన ఈ సంస్థ జిల్లాలో పది వరకు సీట్లు వస్తాయని అంచనా వేసినట్టు వైసిపి శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. ఈ అంచనాలు పూర్తిగా తప్పాయి. ఐప్యాక్ చెప్పినట్లు కనీసం ఒకటి, రెండు సీట్లలో కూడా గెలవకపోవడం వైసిపి శ్రేణులను నిరుత్సాహానికి గురి చేస్తోంది.

మొదటి మహిళా ఎమ్మెల్యేగా పల్లె సింధూర

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

పుట్టపర్తి నియోజకవర్గ చరిత్రలో మొట్ట మొదటి సారిగా మహిళా ఎమ్మెల్యేగా పల్లె సింధూర ఎంపికై రికార్డు సృష్టించింది. ఎమ్మెల్యేగా ఎంపికైన సంధర్భంగా బుధవారం పుట్టపర్తి లోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసిన టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలు పల్లె సింధూరను, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి టిడిపి యువనేత పల్లె వెంకటకష్ణ కిషోర్ రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పుట్టపర్తి లోని పల్లె నివాసం జనసంద్రంగా మారింది. ప్రజలతోపాటు అధికారులు , అనధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు వీరిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని వారికి జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ బాధ్యతగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో శాంతి భద్రతలకు పెద్దపీట వేస్తామని అన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. నియోజకవర్గంలో టిడిపి విజయానికి పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. అంతకుముందు ఉదయం సత్తెమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, పల్లె కష్ణ కిషోర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్నికల నిర్వహణలో విజయం సాధించాం : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయం సాధించారని వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నామని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల అయింది. పోలింగ్ సమయంలో అధికారులందరూ సక్రమంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తమ విధులు నిర్వహించారన్నారు. అలాగే కౌంటింగ్ సమయంలో కూడా అందరూ బాగా పనిచేశారన్నారు. ముఖ్యంగా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా బందోబస్తును చక్కగా నిర్వహించారన్నారు. అలాగే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను పాటించి గౌరవించారన్నారు. వారిని కూడా అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఎన్నికల నియమ నిబంధనలను పాటించి ఎక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా సహకరించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రతిభా విద్యార్థికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - తలుపుల

2023 –24 సంవత్సరానికి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి మండలం నందే మొదటి స్థానంలో నిలిచిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎద్దుల సుశాంత్ రెడ్డి (589)కి ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఉచిత విమాన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాడు. పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తలమర్ల ప్రభాకర్ తన సొంత ఖర్చులతో ఆ విద్యార్థికి బుధవారం బెంగళూరు నుంచి హైదరాబాద్ వరకు విమాన ప్రయాణం చేసే అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి మాట్లాడుతూ మొట్టమొదటి సారి విమాన ప్రయాణం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకుంటానని చేరుకుంటానని అన్నారు.

'ప్రజల తీర్పును గౌరవిస్తున్నాం'

వైసిపి నాయకురాలు దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

విలేకరులతో మాట్లాడుతున్న దీపిక

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తున్నామని... ప్రజాక్షేత్రంలో గెలుపు ఓటములు సహజమని, ఎన్నికల్లో వైసిపి ఓడినప్పటికీ నైతికంగా తామే గెలిచామని వైసిపి నాయకురాలు దీపిక అన్నారు. బుధవారం సాయంత్రం వైసిపి నాయకురాలు దీపిక విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన.... నైతికంగా వైసిపి గెలిచిందన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తమను నమ్మి ఆశీర్వదించి ఓటు వేసిన హిందూపురం నియోజకవర్గ ప్రజలందరికీ కతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. అదేవిధంగా పార్టీ బలోపేతానికి నిరంతరం కషి చేస్తామన్నారు. 2029 ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించి, జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.

నీట్‌లో ర్యాంకు సాధించిన కుమారుడికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

నీట్‌లో 885వ ర్యాంక్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నీట్ ఫలితాల్లో (ఆల్ ఇండియా నీట్‌లో) ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థి గుర్రం రామ్‌చైతన్య ఓబీసీ కింద 885వ ర్యాంకు సాధించారు. నీట్‌లో 720 మార్కులకు గానూ 696 మార్కులు సాధించాడు. దీంతో ఆల్ ఇండియా కోటాలో 2,545వ ర్యాంకు రాగా ఓబీసీ కింద 885 ర్యాంకు దక్కింది. విద్యార్థి తండ్రి గుర్రం లక్ష్మీనారాయణ చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. రామ్‌చైతన్య ఇంటర్‌లో 978 మార్కులు, నీట్‌లో ఓబీసీ కింద 885వ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు గుర్రం లక్ష్మీనారాయణ, రుక్మిణి హర్షం వ్యక్తం చేశారు. రామ్‌చైతన్య మాట్లాడుతూ ఎంబీబీఎస్ తర్వాత న్యూరోసర్జన్ చేయాలన్నదే తన ఆశయమన్నారు.

ముదిగుబ్బ విద్యార్థి ప్రతిభ..

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రానికి చెందిన విద్యార్థి నీట్ ఫలితాల్లో ప్రతిభ కనపర్చాడు. మండలకేంద్రంలో నివాసం ఉంటున్న వెంకటేష్ నాయక్, తులసీ బాయి దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులు. వీరి కుమారుడు గణేష్ నాయక్ నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా ర్యాంక్ 24626 , క్యాటగిరి ర్యాంక్ 116 సాధించాడు. తమ కుమారుడు ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె జాహ్నవి తిరుపతిలోని ఎస్ వి. మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోందని చెప్పారు.

ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఇంటి వద్ద సందడి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఇంటి వద్ద బుధవారం సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యేగా సత్యకుమార్ యాదవ్ గెలుపొందడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానంగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తన అనుచరులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి వచ్చి సత్యకుమార్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సత్యకుమార్‌యాదవ్ ఇంటి వద్ద ఉదయం 7 గంటల నుంచే కూటమి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలపడానికి క్యూకట్టారు. అనంతరం ఆయన శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు.

సత్యకుమార్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం

అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చారు..!

ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అవినీతి, అసమర్థ వైసిపి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు కూకటి వేళ్లతో కూల్చిపారేశారని ఉమ్మడి అనంతపురం జిల్లాల టిడిపి అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, వడ్డే అంజినప్పలు తెలియజేశారు. బుధవారం నాడు అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ మంగళవారం నాడు వెలువడని ఎన్నికల ఫలితాలు రాష్ట్రం, జిల్లాలో కనివిని ఎరుగని రీతిలో ఎన్డీయే కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారాని తెలిపారు. దేశంలోనే బలమైన పార్టీగా తెలుగుదేశం అవతరించిందని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్, బిజెపి ఆధ్వర్యంలో ఏర్పడిన ఎన్డీయే కూటమి రాష్ట్రంలో ఉన్న అహంకార జగన్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో కూల్చివేయించారన్నారు. వైసిపి నాయకుల అహంకారం, సైకో విధానాలు చూడలేక విసిగిపోయిన ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అని నమ్మి కూటమిని అధికారంలోకి తెచ్చారన్నారు. జిల్లా చరిత్రలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలు గెలవడం శుభపరిణామం అన్నారు. హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు వడ్డే అంజినప్ప మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలోనూ జిల్లాలోనూ తెలుగుదేశం–జనసేన–బిజెపి కూటమికి వచ్చిన ఫలితాలు చరిత్రను సృష్టించాయన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్ర మోడీపై ఉన్న నమ్మకంతో ప్రజలు ఏకపక్ష తీర్పును ఇచ్చారన్నారు. గత ఐదు ఏళ్లుగా ప్రజలు జగన్ అవినీతి, సైకో విధానాలు, ప్రజావ్యతిరేక విధానాలతో విసిగిపోయారన్నారు. జగన్ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేవళ్ల మురళి, తెలుగుయువత పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురుబ నారాయణస్వామి, హిందూపురం పార్లమెంట్ నాయకు రమేష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు

రాష్ట్రంలో టిడిపి వెంటే ముస్లిములు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మహమ్మద్‌రఫీ

ముస్లిం మైనార్టీలు రాష్ట్రవ్యాప్తంగా టిడిపి, కూటమి వెన్నంటే ఉన్నారని ఆ పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌రఫీ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని, రంజాన్ తోఫా, హజ్ యాత్రికుల సాయం పెంపు విషయంలో మాట తప్పిందన్నారు. పుట్టపర్తిలో టిడిపి ప్రభుత్వం రూ. 1.25 కోట్ల వ్యయంతో ముస్లిం మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తే దానికి వైసిపి పాలనలో కనీసం మరుగుదొడ్లు, విద్యుత్, భూగర్భ డ్రైనేజీ పనులు చేయలేకపోయారన్నారు. దీంతో ముస్లింలు ఎక్కువ శాతం ఎన్నికల ముందే టిడిపిలోకి చేరాలని తెలిపారు. ముస్లిం వక్ఫ్ బోర్డుకు సంబంధించి కోట్ల విలువైన ఆస్తులు, రక్షణపై మీనవేషాలు లెక్కించారని, మైనారిటీలకు రూ. 40 వేల కోట్లు దక్కకుండా చేశారన్నారు. పలు సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో ముస్లింలు జగన్‌కు దూరమై కూటమికి దగ్గరయ్యారన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ముస్లిం మైనార్టీలు ఉన్న నియోజకవర్గాల్లో కూడా కూటమి అభ్యర్థులకు మెజార్టీ రావడం వెనుక ముస్లిం మైనార్టీ నాయకుల పాత్ర ఎంతో ఉందన్నారు. వక్ఫ్ బోర్డ్ భూముల పరిరక్షణకు ప్రహరీలు నిర్మించి భద్రత పెడతామని చెప్పి వాటిని కాజేసే ప్రయత్నాలు సాగించారని తెలిపారు. మూడేళ్లపాటు షాదీ తోఫా ఊసే ఎత్తలేదని తీరా ఎన్నికలకు ముందు కొద్ది మందికి ఆ పథకం అమలు చేశారన్నారు. మసీదులు, ఈద్గాలు, దర్గాల మరమ్మతులకు నిధుల విషయంలో అలసత్వం వహించారన్నారు. గత టిడిపి పాలనలో 13 దేశాల్లో ఉన్నత చదువుల కోసం 527 మంది ముస్లిం విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తే జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 70 మందికి మాత్రమే ఆర్థిక సాయం అందజేసిందన్నారు. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ఓటింగ్ సరళని పరిశీలిస్తే టిడిపి వెన్నంటే ముస్లింలు ఉన్నారన్న విషయం తేటతెల్లమైందన్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించిన వారికి కృతజ్ఞతలు :ఎస్పీ

పజాశక్తి - పుట్టపర్తి రూరల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినందుకు శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సంబంధిత అధికారులకు ప్రజలకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కౌంటింగు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లాలో మంగళవారం కౌంటింగు బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు, అందరూ సమిష్టిగా పనిచేయడం వల్లనే జిల్లాలో కౌంటింగు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. ప్రతీ ఒక్కరు అంకితభావం, చిత్తశుద్ధితో పని చేయడం హర్షనీయమన్నారు. కీలక ఘట్టమైన కౌంటింగు ప్రశాంతంగా ముగించేలా ఉత్తర్వులు జారీ కావడంతో పాటు అదనంగా బలగాలు రావడం జరిగిందన్నారు. వీటివల్ల కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎంతో దోహద పడిందన్నారు. కౌంటింగు రోజున అవాంఛనీయ ఘటనలు తలెత్తే అవకాశం ఉండొచ్చని అనుకున్నామని అయితే ప్రశాంతంగా ముగియడం శుభ పరిణామమని అన్నారు. ఇదే స్ఫూర్తితోనే ఎలాంటి సంఘటన తలెత్తకుండా జిల్లాను ప్రశాంతంగా ఉంచుదామని పిలుపునిచ్చారు. అదేవిధంగా. కౌంటింగు ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు జిల్లా ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కందికుంటకే కదిరి పట్టం

కందికుంట వెంకటప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గం ప్రజలు కందికంటకే పట్టం కట్టారు.కంది కుంట వెంకట ప్రసాద్ రెండు దశాబ్దాల నుండి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఈ ప్రాంత ప్రజలతో మమేకమై 20 ఏళ్లుగా రాజకీయాల్లో స్థిరమైన నాయకత్వం కొనసాగిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కూటమి తరపున కదిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగిన కందికుంటకు నియోజకవర్గ ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించారు. కందికుంట రాజకీయ ప్రస్తానాన్ని పరిశీలిస్తే ఆయన ప్రస్తానం అనేక ఒడిదిడుకుల మధ్య కొనసాగింది. 2004లో కందికుంట వెంకటప్రసాద్ మాజీమంత్రి పరిటాల రవీంద్ర శిష్యునిగా కదిరి ప్రజలకు రాజకీయ పరిచయం అయ్యాడు. 2004లో పొత్తులో భాగంగా టిడిపి కదిరి ఎమ్మెల్యే టికెట్ బిజెపికి కేటాయించింది. దీంతో తనకు దక్కక పోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తూ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ ఎన్నికల్లో ఓటమి చెందినా ద్వితీయ స్థానంలో నిలిచారు. కదిరి ప్రజలకు ఆయన పట్ల ఉన్న అభిమానాన్ని వ్యక్తిగత ఓటు బ్యాంకును గుర్తించిన టిడిపి అధిష్ఠానం 2009లో కదిరి నియోజకవర్గం నుండి టిడిపి తరపున టికెట్ ఇచ్చింది. ఆ ఎన్నికలలో కందికుంట విజయం

కష్టానికి తగిన ప్రతిఫలం

సాధించారు. 2014లో విజయావకాశాలు ఉన్నప్పటికీ ఉదాసీనతగా వ్యవహరించి ప్రజలకు చేరువ కాకపోవటంతో స్వల్ప ఓట్లతో పరాజయం పాలయ్యాడు. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ హవా కొనసాగడంతో రెండవసారి వైసిపి కూడా విజయం సాధించింది. మూడోసారి హ్యాట్రిక్ కొట్టాలన్న ఆ పార్టీ నాయకుల ఆశలకు గండికొడుతూ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ కదిరి ప్రజలకు కందికుంటకు పట్టం కట్టారు.

బలమైన నాయకుడిగా గుర్తింపు : 2014 ఎన్నికల్లో కందికుంటకు నియోజకవర్గంలో బలమైన ప్రజానాయకుడిగా పేరుపొందారు కొంతమంది స్వార్థపరుల మాటలను నమ్మి ఆ ఎన్నికల్లో నిర్లక్ష్యం కారణంగా 800 ఓట్ల స్వల్ప తేడాతో ఎమ్మెల్యే పదవిని చేజార్చుకున్నట్లు ఇప్పటికీ రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కందికుంట ఎమ్మెల్యే కాకపోవడంతో కదిరి అభివృద్ధికి నోచలేదన్న అభిప్రాయాలూ ఉన్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో న్యాయపరమైన కొన్ని అడ్డంకులు ఎదురైనా, న్యాయస్థానం వాటిని కొట్టివేయడంతో కదిరి ప్రజల మధ్య మచ్చలేని నాయకునిగా కందికుంట ఐదోసారి ఎన్నికల బరిలో నిలిచారు. మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్ లో కందికుంట విజయం సాధించడంతో తన అనుకున్న లక్ష్యసాధనకు

కందికుంట వెంకటప్రసాద్

అనుగుణంగా ప్రణాళికలు రచించి కదిరి నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

మంత్రి రేసులో కందికుంట ! : త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని మంత్రి వర్గంలో కందికుంట వెంకటప్రసాద్‌కు చోటు ఉంటుందని నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆశిస్తున్నారు. కందికుంట వెంకటప్రసాద్ సేవలను పరిగణలోకి తీసుకొని పార్టీ పట్ల ఆయనకున్న ఉన్న అంకిత భావాన్ని పరిగణలోకి తీసుకొని కందికుంట మంత్రివర్గంలో చోటు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అభినందనల వెల్లువ : కందికుంట 10 సంవత్సరాల తర్వాత ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణులు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు బుధవారం ఉదయం నుండి ఆయన నివాసానికి క్యూ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్టు వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిలమత్తూరుకు చెందిన ఖాదర్ బాషా(70)ను ఓ ప్రయివేటు బస్సు ఢీకొనడంతో తలకు రక్త గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని బెంగుళూరు లోని విక్టోరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని గుర్రప్పకొండ గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వ్యక్తిని మరో ప్రాంతంలో హత్య చేసి ఇక్కడ తీసుకొచ్చి వేశారా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి- వజ్రకరూరు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివ రాలు.. రాకెట్ల గ్రామానికి చెందిన దాసరి నాగభూషణ(52) సొంత ఆటోలో కాయగూరలు తీసుకొచ్చి రాకెట్ల గ్రామంలో అమ్మేవాడు. అదే గ్రామానికి చెందిన బోయ హనుమక్క(63) కూరగాయల వ్యాపారం చేయడానికి రాకెట్ల గ్రామం నుంచి ఉరవకొండకు ఆటోలో వెళ్తుండగా గ్రామ సమీపంలో ఉరవకొండ నుంచి వస్తున్న కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలిసినే వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు భీమ్‌రెడ్డి ఆర్థికసాయం

రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తనయుడు భీమ్‌రెడ్డి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకొని మృతదేహాలను సందర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు దహన ఖర్చులకు బోయ హనుమక్క కుమారులకు రూ. 10 వేలు, దాసరి నాగభూషణ కుమారులకు రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

ఆవు పొడిచి మహిళా రైతుకు గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో బుధవారం ఆవు పొడవడంతో ఓ మహిళా రైతు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన మహిళా రైతు శివమణి తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుం డగా అక్కడే ఉన్న ఆవు బెదిరి ఆమెను పొడిచింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం శివమణిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ముదిగుబ్బలో మొక్కలు నాటుతున్న ఎంఇఒ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ముదిగుబ్బ

పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శాంతి ఆనంద్ స్కూల్‌లో విద్యార్థులు ఎంఇఒ రమణప్ప ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎంఇఒ విద్యార్థులకు పర్యావరణ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. మనం చేస్తున్న అనేక తప్పిదాల వల్ల పకృతి సమతుల్యత దెబ్బతింటోందన్నారు. దాని పర్యవసానంగా వేడి పెరిగిపోవడం, అకాల వర్షాలు పడడం, ప్రకతి విపత్తులు జరగడం, వర్షాలు పడకపోవడం, అనేక జీవరాసులు నశించి పోవడం లాంటివి జరుగుతున్నాయన్నారు. అడవులకు నిప్పుపెట్టడం, చెట్లు నరికివేయడం ప్లాస్టిక్ వాడడం లాంటివి మానుకోవాలన్నారు. చెరువులలో పూడిక తీసి నీటిని సంరక్షించడం, రైతులు పొలాలలో నీటిగుంతలు ఏర్పాటు చేసుకోవడం, గట్లపై చెట్లు పెంచుకొని నేల కోతను అరికట్టడం లాంటివి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.రాజశేఖర్, హరి, సుగుణమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మొక్కలు నాటారు. బుధవారం పెనుకొండ మండలం గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శివరామకృష్ణ మొక్కలు నాటారు. అనంతరం శివరామకృష్ణ జన్మదిన వేడుకలను మిత్రులు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా మడకశిర ఆయుర్వేద హాస్పిటల్ నందు రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, ఉపాధ్యక్షులు నాగరాజు, సూరి, సభ్యులు న్యాయవాదులు డి. నాగరాజు, శ్రీనివాసులు, డాక్టర్ శ్రావణి డాక్టర్ నాగరాజు నాయక్, వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, మురళి బహుజన చైతన్య వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కను అందిస్తున్నశివరామకృష్ణ

విజయం.. ప్రజలకు అంకితం : ఎమ్మెల్యే పల్లె సింధూర

విలేకరులతో మాట్లాడుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన విజయాన్ని వారికే అంకితం ఇస్తున్నామని ఇది ప్రజా విజయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పుట్టపర్తి లోని సత్యమ్మ దేవాలయంలో తన కుటుంబసభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పల్లె కుటుంబసభ్యులకు ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తన పట్ల నమ్మకంతో ప్రజలు తమ సొంత ఆడబిడ్డలా ఆదరించి అభిమానించి గెలిపించినందుకు వారికి రుణపడి ఉంటామన్నారు. తన మామయ్య, తన భర్త సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు.

ప్రజల తీర్పు విలక్షణం : మాజీ మంత్రి పల్లె

రాష్ట్ర ప్రజలు రాక్షస పాలన అంతం చేయడానికి కంకణం కట్టుకుని విలక్షణమైన తీర్పు ఇచ్చారని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు చంద్రబాబు తోనే అభివద్ధి సాధ్యమని నమ్మి ఓటుతో జగన్ కు బుద్ధి చెప్పారన్నారు. ఉద్యోగస్తులు, నిరుద్యోగులు, అంగనవాడీ, ఆశా వర్కర్లు, వృద్ధులు, వికలాంగులు, అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనను తిరస్కరించారన్నారు. ఐదేళ్ల పాలనలో నరకం అనుభవించామని చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అధిష్టానం నమ్మకాన్ని ప్రజల ఆశలను నెరవేర్చడానికి పల్లె సింధూర రెడ్డి కృషి చేస్తుందని అన్నారు.

చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -పెనుకొండ

తెలుగుదేశం పార్టీ భారీ మెజారిటీతో గెలవడంతో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పెనుకొండ ఎమ్మెల్యే ఎస్.సవితమ్మ పాలాభిషేకం చేశారు. బుధవారం పెనుకొండ పట్టణంలో టిడిపి నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు.అనంతరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు సవితమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్చాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సవితమ్మ మాట్లాడుతూ భారీ మెజారిటీని అందించి కూటమికి మద్దతు పలికిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గం ప్రజలకు అండగా ఉంటానని పెనుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మ

పెద్దిరెడ్డి పెత్తనం ఏమైందో..?

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సిఎం తర్వాత సిఎం అని చెప్పుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం ఏమైందోనని కదిరి పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కదిరి నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల సమయంలో టిడిపి అభ్యర్థి కందికుంటను ఓడించాలనే లక్ష్యంతో నియోజకవర్గమంతా సుడిగాలి పర్యటన చేశారు. ప్రస్తుత ఫలితాలను చూసిన సొంతపార్టీ నాయకులే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం ఏమైందోనని అని వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీని వీడకుండా పార్టీకి విధేయులుగా ఉన్న వారిని కూడా పట్టించుకోకుండా స్వలాభం కోసమే నిర్ణయాలు తీసుకున్న పెద్దిరెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని విమర్శిస్తున్నారు. కదిరి వచ్చిన ప్రతిసారి పెద్దిరెడ్డి గజమాలతో స్వాగతం పలికించుకోవడమే తప్ప అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి సిపాయిల్లా పని చేస్తున్న నాయకులను గుర్తించని పెద్దిరెడ్డి తనకు ఊడిగం చేసిన వారికే పెద్దపీట వేశారని ఈ కారణంతోనే వైసిపికి ఈ ఎన్నికల్లో తగిన శాస్తి జరిగిందని వ్యాఖ్యానిస్తున్నారు. కదిరిలో కందికుంట మార్కును దెబ్బతీయడానికి వైసీపీ

కదిరిలో పారని వైసీపీ పాచికలు

అధిష్టానం తీవ్ర ప్రయత్నాలు చేసినా వారి పాచికలు పారలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. కదిరి నియోజకవర్గ ప్రజలే తన కుటుంబమని పదేపదే చెబుతున్న కందికుంటకు నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారని అంటున్నారు. వైసీపీ అధిష్టానం ఎన్ని కుట్రలు కుతంత్రాలు, ఎత్తుగడలు వేసినా ఆపార్టీకి ఓటమి తప్పలేదని వ్యాఖ్యానిస్తున్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ అమర రమేష్ బాబు తెలిపారు. పాఠశాలకు చెందిన చైతన్య, నిత్యశ్రీ, లేఖన, బి శరణ్య, సాయి, యశస్విని రేవతి సాయి అనే విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

గుత్తి మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ రాజీనామా

గుత్తి : గుత్తి మార్కెట్ యార్డ్ పాలకమండలి ఛైర్‌పర్సన్ చెవుల సునీలయాదవ్ బుధవారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందడంతో ఆమె తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. గుంటూరు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారులకు తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు తెలిపారు.

కవితా సంపుటిలకు ఆహ్వానం

అనంతపురం : ప్రతిష్ఠాత్మకమైన విమల స్మారక 'విమల శాంతి సాహిత్య పురస్కారం–2024' కోసం జాతీయ స్థాయిలో కవుల నుంచి 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురించబడిన వచన కవితా సంపుటిలను ఆహ్వానిస్తున్నట్లు శాంతి నారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కవులు తమ కవితా సంపుటాలు నాలుగేసి కాపీలను జూలై 15వ తేదీ లోపు ఉప్పరపాటి వెంకటేశులు, 16–37–1, రాహుల్ నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం–515004 కు పంపాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలోని మందలపాడు వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు తల్లిదండ్రులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు మందలపాడులోని ఎపి మోడల్ స్కూల్ తాడిపత్రిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. మెరిట్, రోస్టర్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని, 7, 8, 9వ తరగతుల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మను సన్మానిస్తున్న నాయకులు

ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు

ప్రజాశక్తి గోరంట్ల

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన హిందూపురం పార్లమెంటు ఎంపీ పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మను టిడిపి గోరంట్ల నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండ కేంద్రానికి వెళ్లి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, జయరాం, వేణు రాయల్, బొబ్బలి రామ్మోహన్, నరేంద్ర, పసుపులేటి శ్రీనివాసులు, దేవా నరసింహప్ప, బాలకృష్ణ చౌదరి, శ్రీనివాసులు, మల్లికార్జున, గంగాధరప్ప తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : హిందూపురం ఎంపీ బికె. పార్థసారథికి అభినందనలు వెళువెత్తాయి. బుధవారం పెనుకొండ పట్టణంలోని టీడీపీ హిందూపురం పార్లమెంట్ కార్యాలయంలో బికె. పార్థసారథిని పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్చాలు, పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి రూరల్ : రాప్తాడు ఎమ్మెల్యేగా గెలుపొందిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను పుట్టపర్తి కూటమి సభ్యులు, మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం వెంకటాపురం గ్రామానికి వెళ్లి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌కు పూలమాలలు బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్మికుల సంఘం కన్వీనర్ హరికృష్ణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కొండమరాజు, జిల్లా మీడియా కన్వీనర్ జ్యోతి ప్రసాద్, జిల్లా కోశాధికారి సురేంద్ర బాబు, పుట్టపర్తి టౌన్ బీజేపీ అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి నారాయణ, కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : హిందూపురం ఎంపీ పార్థసారథి స్వగృహం వద్ద నాయకుల సందడి నెలకొంది. మండలంలోని ఆర్. మరవ పల్లి గ్రామం నందు హిందూపురం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.



బికెను సన్మానిస్తున్న రొద్దం నాయకులు

అధైర్య పడకండి.. అండగా ఉంటాం...

సంపత్‌కుమార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ దారుణ హత్యకు గురి కావడం చాలా బాధాకరమని, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం, కాంగ్రెస్ పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి, ఆంధ్రప్రదేశ్ ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధు యాదవ్, తెలంగాణ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మోర్ వెంకట్, కర్ణాటక అధ్యక్షులు కీర్తి గణేష్ అన్నారు. సంపత్‌కుమార్ గత నెల 30న దారుణ హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో నాయకులు సంపత్ కుమార్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అదే విధంగా జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ ఫోన్ ద్వారా సంపత్ కుమార్ తండ్రి రాజశేఖర్ ను పరామర్శించారు. సంపత్ కుమార్ ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరు అధైర్య పడకూడదని, పార్టీతో పాటు అందరు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేసుకు సంబంధించిన విషయాలపై జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తో ఎన్ ఎస్ యు ఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. త్వరగా నిందితులను పట్టుకొని శిక్షించాలని కోరారు. అనంతరం వరుణ్ చౌదరి మాట్లాడుతు సంపత్ కుమార్ తనకు ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని పోలీసులను అనేక సార్లు కోరినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఈ విషయాన్ని సంపత్ కుమార్ తన సోషల్ మీడియా ద్వారా పోస్టు చేశారన్నారు.

ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షులు వరుణ్ చౌదరి

సకాలంలో పోలీసులు స్పందించక పోవడంతోనే సంపత్ కుమార్ దారుణ హత్యకు గురయ్యారన్నారు. హత్య చేసిన వారితో పాటు సూత్రదారిని సైతం పోలీసులు వెంటనే అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షపడే విధంగా చూడాలన్నారు. లేని పక్షంలో ఎన్ఎస్‌యూఐ ఆద్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కేసును సిబిఐకు అప్పగించే విధంగా జాతీయ స్థాయిలో రాహుల్ గాంధి నేతృత్వంలో ప్రయత్నం చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్ఎస్‌యు అధ్యక్షుడు నాగు మధు మాట్లాడుతు సంపత్ కుమార్ ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందులో పోలీసులు నిర్లక్ష్యం చేస్తే రాష్ట్ర డిజిపిని కలిసి తగిన చర్యలు తీసుకునే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. అనంతరం ఎన్ఎస్‌యుఐ నాయకులు చెక్కు రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో మరింత సహాయాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ధ్రువ కుమార్ రెడ్డి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఇడపబత్తిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.